క్లుప్తంగా

జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక



ఐనవోలు : శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే యువ తేజం జాతీయ ప్రతిభా పురస్కారానికి మండల కేంద్రానికి చెందిన బరిగెల సందీప్ ఎంపికయ్యారు. తాను సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఈనెల 21వ తేదీన విజయవాడలో జరుగుతున్న కార్యక్రమానికి ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ చైర్మన్, శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆహ్వానించినట్లు సందీప్ తెలిపారు. అదే రోజు నిర్వాహకులు అవార్డును ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

రామ్మూర్తిపై చర్య తీసుకోవాలని



కమలాపూర్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే వారిని రాష్ట్ర బహిష్కరణ చేయాలని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను కొట్టి చంపే పరిస్థితి వస్తుందని రామ్మూర్తి మాట్లాడాడని ఆరోపించారు. మంద కృష్ణమాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అతడిపై కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్, జిల్లా కార్యదర్శి రవీందర్, నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై ఫిర్యాదు

ఆత్మకూరు : అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని భార్య స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. సీఐ సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నాగనబోయిన కల్పనను అదే గ్రామానికి చెందిన నాగనబోయిన అశోక్‌కు ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కొంతకాలంగా అశోక్ అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఆమె పుట్టింటికి వెళ్లింది. ఈనెల 1న అత్తగారింటికి వచ్చిన భర్త అశోక్.. భార్యతో పాటు ఆమె తల్లి కందికొండ రమ, తండ్రి పోషాలుతో గొడవపడి దుర్భాషలాడుతూ దాడి చేసి గాయపర్చాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అదనపు కట్నం కోసం వేధిస్తున్న అశోక్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి 'చాడ' పరామర్శ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన జేఏసీ జిల్లా కన్వీనర్, బీఎస్పీ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు చెప్యాల ప్రభాకర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి శనివారం ధర్మారం గ్రామానికి చేరుకుని మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభాకర్ చిన్నతనంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించడంతో పాటు అనేక పోరాటాల్లో సహకారం అందించారని గుర్తుచేశారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జక్కు రాజు, మల్లేష్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

టీపీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ పరామర్శ



ఐనవోలు : మండలంలోని నందనం గ్రామంలో పిట్టల లచ్చమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. వారివెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు సాంబయ్య, సంపత్, శ్రీనివాస్, సత్యం, సమ్మయ్య, కుమార్, రాజు, రవి, శ్రీనివాస్, రాంబాబు ఉన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ..



రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేసిన ప్రహరీ



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నర్సరీ

- రోడ్డు విస్తరణ పనుల్లో కూల్చివేత
- పాఠశాల ఆవరణలోనే వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాల రెండూ ఒకే ప్రాగణంలో ఉన్నాయి. రెండు పాఠశాలల్లో దాదాపు సూమారు 260 మంది పైచిలుకు విద్యార్థుల చదువుకుంటున్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అప్పటి సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రహరీని కూల్చివేసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులకు రక్షణ కరువైంది. పాఠశాల ప్రధాన రహదారికి దగ్గరగా ఉండడం, పాఠశాల ఆవరణలో ఉన్న మండల విద్యావనరుల కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాలయానికి కేటాయించడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు పాఠశాల ఆవరణలోనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం వాహనాల రాకపోకలతో విద్యార్థుల ఏకాగ్రత అటువైపు మళ్లుతోందని, చదువుపై దృష్టి పెట్టడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. గత సంవత్సరం పదోతరగతి పరీక్షల సమయంలో పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటంతో అప్పటికప్పుడు ప్రధాన రహదారి వెంబడి పరదాలు కట్టి పరీక్షలు నిర్వహించి పరీక్షల అనంతరం తొలగించారు. రాత్రి సమయంలో మందుబాబులు పాఠశాల ఆవరణలో మద్యం సేవించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గత సంవత్సరం పదోతరగతి పరీక్షల సమయంలో పరదాలు కట్టిన ఉపాధ్యాయులు

క్రీడలకు దూరం..

ప్రభుత్వ పాఠశాల ఆవరణలోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడా మైదానం, నర్సరీ, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయడంతో క్రీడలు ఆడేందుకు స్థలం లేకుండా పోయిందని విద్యార్థులకు వాపోతున్నారు. శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు రోజు మొత్తంలో ఒక పీరియడ్‌ను కేటాయించాల్సి ఉన్నా స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కానీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోనే మండల పరిషత్ కార్యాలయం, వాహనాల పార్కింగ్, నర్సరీ ఉండటంతో విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి



ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో కొంతమంది పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రహరీ నిర్మించాలి.

– ఎండీ ఆరీఫ్, స్థానికుడు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి కృషి

టీజీసీజీటీఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ సురేందర్‌రెడ్డి

పరకాల : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి కృషి చేస్తానని టీజీసీజీటీఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ కదారి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన అనంతరం అధ్యాపకులను, విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అధ్యాపకులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అప్పుడే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మనుగడ సాధ్యమవుతుందన్నారు. కొత్త కోర్సుల ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ.. సంఘం వ్యక్తుల కోసం కాకుండా వ్యవస్థల కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగేలా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీసీజీటీఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చిన్న, సంఘం బాధ్యులు డాక్టర్ ఎలిశాల అశోక్, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ జగదీశ్‌బాబు, డాక్టర్ ఈశ్వరయ్య, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ విజయపాల్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కదారి సురేందర్‌రెడ్డి

ఆటో కార్మికుల హక్కుల సాధనకు పోరాడుదాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

హన్మకొండ: ఆటో కార్మికుల హక్కుల సాధనకు పోరాడుదామని త్రిచక్ర సొసైటీ అధ్యక్షుడు ఈసంపల్లి సంజీవ, కో ఆర్డినేటర్ నేరెళ్ల రవీందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో త్రిచక్ర సహకార సంఘం నాలుగో మహాసభ పోస్టర్, కరపత్రాలను సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజీవ, రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులకు త్రిచక్ర పొదుపు, పరపతి పరస్పర సహాయ సహకార సంఘం అండగా నిలుస్తోందని, నాలుగేళ్లలో రూ.3.50 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈనెల 19న హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సంఘం మహాజన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. టీఎస్ అపెక్స్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, గాయత్రి కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ముత్యాల లక్ష్మణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి చీకటి కుమార్, డైరెక్టర్లు కలకోట్ల జయరాం, బొల్లం సంజీవ, గుండా రమేశ్, సభ్యులు రవీందర్, చక్రపాణి, గణేష్, దేవేందర్, సంజీవ, ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గ్రామాల్లోకి దొంగలొస్తున్నారు.. జాగ్రత్త!

హసన్‌పర్తి: గ్రామాల్లోకి దొంగలొస్తున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు హసన్‌పర్తి బస్టాండ్‌లో ప్రయాణికులకు శనివారం అవగాహన కల్పించారు. తాళాలు వేసిఉన్న ఇళ్లే టార్గెట్‌గా దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇల్లు విడిచి బయటికి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కాలనీలతో పాటు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కార్యక్రమంలో ఏఎస్సై జనార్దన్, సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ రాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే, హసన్‌పర్తిలోని ఇందిర కాలనీలోని ఓ ఇంటిలో ఓ యువకుడు దూరాడు. పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహాసభకు జర్నలిస్టులు తరలిరావాలి



నయీంనగర్: మాట్లాడుతున్న సురేందర్

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల మహాసభకు మాదిగ జర్నలిస్టులు తరలిరావాలని కవి, గాయకుడు మిట్టపల్లి సురేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్ట హరిత హోటల్‌లో వరంగల్ మాదిగ జర్నలిస్టుల సంఘం సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ఈనెల 20న హనుమకొండలో జరగనున్న లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల సన్నాహక మహాప్రదర్శన విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. మాదిగ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు బొక్క దయాసాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీసీ కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ దరువు అంజన్న, ప్రముఖ రచయిత బైరాగి, జర్నలిస్టులు సీహెచ్.సుధాకర్, బొల్లం సదయ్య, రచయిత, గాయకుడు వరంగల్ శ్రీనివాస్, మాదిగ జర్నలిస్టులు పాల్గొన్నారు.

రేపు లక్ష డప్పుల మినీ ప్రదర్శన

నయీంనగర్: ఎస్సీ వర్గీకరణ పోరాటానికి మద్దతుగా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు.. వేయి గొంతులు ప్రదర్శన విజయవంతం కోసం సోమవారం హనుమకొండలో మినీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు కుమార్ మాదిగ తెలిపారు. వేయి స్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

మల్లన్నను దర్శించుకున్న రాకేశ్‌రెడ్డి



ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. అలాగే స్వామి వారి శేష వస్త్రాలు అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు, ఆలయ మాజీ చైర్మన్ గోపాల్‌రావు, నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ మోహన్, గుంశావలీ, లక్ష్మణ్, సురేష్, కుమార్, అశోక్, రఘు వంశీ పాల్గొన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: పదో తరగతి విద్యార్థుల ఉపయోగార్థం ఇంగ్లిష్ సబ్జెక్టుకు సంబంధించిన ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్ (పాస్ఐ –పాస్)ను హనుమకొండలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ వాసంతి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్‌లోని ప్రాక్టీస్ పేపర్లను ఉపాధ్యాయులు కూడా ఉపయోగించుకొని ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐఈడీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఎల్టా హనుమకొండ జిల్లా బాధ్యులు డాక్టర్ కోల రవికుమార్, కొక్కుల సంపత్‌కుమార్, పండరి వాసు, సుమన, కాంతయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమన జయంతి

హన్మకొండ చౌరస్తా / హన్మకొండ : వేమన భగవాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 19వ తేదీన హనుమకొండలోని టీఎన్జీఓఎస్ ఫేజ్ –2 కాలనీలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, జమ్మికుంట అధ్యక్షుడు వెంకటాచార్యులు తెలిపారు. ఈమేరకు వేమన భగవాన్ జయంతి ఉత్సవాలకు రావాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డిని శనివారం వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. జయంతిలో పాల్గొని వేమన గొప్పదనాన్ని పలువురికి వివరించాలని కోరారు. అంశాలను ఆహ్వాన పత్రిక అందించిన వారిలో రాధిక, శశికాంత్, దివ్య, రాజు, భార్గవి, రాజలింగం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దర్గా ఉర్సు



దర్గాకు గంధం తీసుకెళ్తున్న కమిటీ సభ్యులు

వేలేరు : మండల కేంద్రంలోని హజ్రత్ షేక్ ఫరీద్ షక్కర్ గంజ్ రహ్మతుల్లా అలైహి బాబా దర్గా ఉర్సును దర్గా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అలీబాబా అబ్దుల్ ఉన్నీసా ఇంటి నుంచి గంధం కలశాన్ని మేళతాళాలతో దర్గా వద్దకు తీసుకెళ్లి సమర్పించారు. ఉర్సు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, చైర్మన్ షరీఫ్, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితాలో అవకతవకలు ఉండొద్దు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- సమావేశానికి గ్రామస్తులకు సమచారం ఇవ్వకపోవడంతో ఎంపీడీఓపై ఆగ్రహం



సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు చేపట్టిన అర్హుల జాబితా సర్వేలో అవకతవకలు ఉండొద్దని, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. ఈనెల 26వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డుల మంజూరులో భాగంగా మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో చేపట్టిన సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. గ్రామంలో నాలుగు పథకాలకు సంబంధించి సర్వే జరుగుతున్న విషయం ముందస్తుగా సమాచారం అందించలేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్కడే ఉన్న ఎంపీడీఓ ఫణిచంద్ర, ఇతర శాఖల అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఫోన్ చేసి ఎంపీడీఓ పనితీరు సరిగాలేదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేసి గ్రామసభల ద్వారా అర్హుల జాబితాను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మండలంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలని ఆయన అన్నారు.

శాయంపేట : రాష్ట్రంలోని మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారి సహకారంతో ప్రజ్వల్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఆయన సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారితే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల్ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వీరభద్రుడి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఎల్కతుర్తి : వీరభద్రుడి ఆశీస్సులతో నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని శనివారం ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని కోడె, మొక్కులు చెల్లించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి, పంటలతో కలకలలాడాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు రాంబాబు, సందీప్, వినయ్‌శర్మ నాయకులు ఉన్నారు.



వీరభద్రస్వామికి కోడె, మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

నాణ్యమైన విద్యుత్ అందించాలి

సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఎన్వీ వేణుగోపాల చారి

దామెర : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎన్వీ వేణుగోపాలచారి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సబ్ డివిజనల్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కొత్త సర్వీస్‌లను సకాలంలో రిలీజ్ చేయాలని అన్నారు. వినియోగదారుల బిల్లింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించి వారికి సకాలంలో సేవలందించాలని, వచ్చే వేసవి కాలంలో విద్యుత్ అంతరాయం లేకుండా ఓవర్ లోడ్ ఉన్న గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి రీఎర్తింగ్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెంబర్ ఫైనాన్స్ చరణ్‌దాస్, మెంబర్ టెక్నిక్ రమేశ్, హనుమకొండ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటరమణ, డివిజనల్ ఇంజనీర్ (టెక్నిక్) విజేందర్‌రెడ్డి, పరకాల ఏడీఈ దేవేందర్, పరకాల ఈఆర్ఓ, ఏఏఓ స్వాతి, ఏఈలు రాజు, చందూలాల్, వెంకటేశ్వర్లు, ఇందూజ, రమేశ్, సబ్ ఇంజనీర్లు చందన, చొక్కారావు, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాలచారి

సన్నాహక ప్రదర్శనను జయప్రదం చేయాలి



కమలాపూర్ : డప్పు కళాకారులతో కలిసి దరువేస్తున్న రవీందర్

కమలాపూర్ : హనుమకొండ జిల్లా కేంద్రంలో ఈనెల 20వ తేదీన నిర్వహించతలపెట్టిన వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి శనిగరపు రవీందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద డప్పు కళాకారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ వెంటనే చేయాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా హనుమకొండలో సన్నాహక ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనకు డప్పు కళాకారులు డప్పులతో కదిలి రావాలని కోరారు. అనంతరం డప్పు కళాకారులు, నాయకులతో కలిసి దరువేశారు. దండోరా డప్పు కళాబృందం పట్టణ అధ్యక్షుడు మొగిలి, మాజీ ఎంపీపీ రమేశ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మాజీ సర్పంచ్ సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

శాయంపేట : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శనకు దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ప్రదర్శన చేపట్టారు.

ఐనవోలు : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసే శక్తులను రాబోయే రోజుల్లో ఓడించి వర్ధన్నపేట నియోజకవర్గంలో మాదిగ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి సెంటర్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పుల ప్రదర్శన మండల అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. వర్గీకరణ జరిగితే ఎస్సీల్లో 59 కులాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కాకుండా జరుగుతున్న కుట్రలను ఎదుర్కొనేందుకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వెయ్యి గొంతులు, లక్షల డప్పుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20న జిల్లా కేంద్రంలో వేలాది డప్పులతో సన్నాహక మహా ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ ఇతర కుల సంఘాల నేతలు పాల్గొంటారని తెలిపారు.

పరకాల : ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వెయ్యి గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, డప్పు కళాకారుల సంఘం ఉమ్మడి జిల్లా నాయకుడు కేతపాక రాజు మాదిగ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని అమరధామంలో జరిగిన సమావేశంలో మండల డప్పు కళాకారుల సంఘాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పెండెల రంజిత్, ప్రధాన కార్యదర్శిగా పసుల సదానందం, ఉపాధ్యక్షుడిగా ఏకు కేశవులు, కొయ్యడ అకిల్, ప్రచార కార్యదర్శిగా బొచ్చు విష్ణులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.